# ఆంధ్రోళ్లకు ఇంకా ఆశ చావలె..


ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి విజయ చిహ్నం చూపుతున్న దివ్యాంగులు

- కేసీఆర్ ఓడితే తెలంగాణను కలిపేస్తరు
- దొంగలకు సద్ది మోయద్దు.. గోస పడొద్దు
- బీఆర్ఎస్‌తోనే దివ్యాంగులకు ఆత్మగౌరవం
- మరోసారి వస్తే ₹6 వేలు ఇస్తాం
- కాంగ్రెస్ వస్తే పథకాలను ఎత్తేస్తది
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- దివ్యాంగులతో ఆత్మీయ సమ్మేళనం

కార్పొరేషన్, నవంబర్ 5: 'తెలంగాణపై ఆంధ్రోళ్లకు ఇంకా ఆశ చావలేదు. కేసీఆర్‌ను ఓడగొట్టి తెలంగాణను ఆంధ్రాలో కలుపాలని చూస్తున్రు. కాంగ్రెస్, బీజేపీల ముసుగులో హైదరాబాద్‌లో అడ్డా వేసిన్రు. అవి ఢిల్లీ పార్టీలు. బీఆర్ఎస్ మన ఇంటి పార్టీ. దొంగలకు సద్ది మోయద్దు. తెలంగాణను ఢిల్లీ, ఆంధ్రోళ్ల చేతుల్లో పెట్టి ఆగం కావద్దు. ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే పథకాలను ఎత్తేస్తయి. బీఆర్ఎస్ మరోసారి వస్తే దివ్యాంగులకు ₹6 వేలు ఇస్తం. కారు గుర్తుకు ఓటేసి నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి' అని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ దివ్యాంగులకు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్‌తోనే దివ్యాంగులు ఆత్మ గౌరవంతో బతుకుతున్నారని, సాయం చేసిన వారిని మరవద్దని సూచించారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు అండగా నిలిచి బీఆర్ఎస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఆదివారం స్థానిక పద్మనాయక కళ్యాణ మండపంలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. దివ్యాంగులు ఎంతో మంది వైకల్యాన్ని జయించి ప్రపంచంలోనే ఉన్నత స్థాయిలో నిలిచారన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందని తెలిపారు. గత ప్రభుత్వాలు దివ్యాంగులకు ₹75, 150 పింఛన్లు ఇచ్చారని వాపోయారు. కానీ సీఎం కేసీఆర్ వారిని ఆదుకోవాలని ₹1500కు పెంచారని, అనంతరం వాటిని ₹3వేలు, ఇప్పుడు ఎవరూ అడగక ముందే ₹4 వేల పింఛన్ ఇస్తున్నారన్నారు. దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటర్ సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. దేవుడు అన్యాయం చేసినా సీఎం కేసీఆర్ మాత్రం దివ్యాంగులకు న్యాయం చేస్తున్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ₹6 వేల పింఛన్ ఇస్తామని భరోసా ఇచ్చారు. సమైక్య పాలనలో అరిగోస పడ్డామన్నారు. స్వయం పాలనలో దివ్యాంగులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మరోసారి కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు.

### దివ్యాంగులతో ఆత్మీయంగా గంగుల మాటామంతి

ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు తమ సమస్యలను మంత్రి గంగులకు వివరించారు. దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఫించన్లు అందిస్తుందని, కానీ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు కోరారు. దీనిపై ప్రభుత్వం, పాలకులు దృష్టి పెట్టాలని విన్నవించారు. దీంతో మంత్రి స్పందించి తప్పకుండా దివ్యాంగులకు మానేరు రివర్ ఫ్రంట్, ఇతర ప్రాజెక్టుల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరితో ఆత్మీయంగా మాట్లాడి తనను ఈ ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. మంచి మనస్సు ఉన్న మీరు ఆశీర్వాదం అందిస్తే తప్పకుండా అంతా మంచి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగులతో ఫొటోలు దిగేందుకు దివ్యాంగులు పోటీపడ్డారు. ఆత్మీయ సమ్మేళనంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం ప్రభాకర్, దివ్యాంగుల సంఘు నాయకులు సంపత్, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటిస్తున్న దివ్యాంగులు


మధురానగర్‌లో సీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్, రాష్ట్ర నాయకులు రవీందర్‌రావు, ప్రేమ్‌సాగర్‌రావు

## సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- మధురానగర్‌లో సభాస్థలం పరిశీలన

గంగాధర, నవంబర్ 5 : ఈ నెల 17న చొప్పదండి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జోగినపల్లి రవీందర్‌రావు, జోగినపల్లి ప్రేమ్‌సాగర్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో సీఎం సభ కోసం స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ సభ విజయవంతం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి దాదాపు లక్ష మందిని సభకు తరలించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, డాక్టర్ అమిత్‌కుమార్, గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్, ఆర్బీఎస్ మండల కోఆర్డినేటర్ పుల్కం గంగన్న, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బందారపు అజయ్‌కుమార్, ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, నాయకులు అట్ల శేఖర్‌రెడ్డి, ఆకుల మధుసూదన్, మడ్లపెల్లి శ్రీనివాస్, వేముల అంజి, దానె ఓదెలు, సుంకె అనిల్, బండారి శ్రీనివాస్, గంగాధర సంపత్, ఇరుగురాల రవి, మారం యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 9, 10న టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర మహాసభలు

విద్యానగర్, నవంబర్ 5: తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యూ) రాష్ట్ర మహాసభలు పోరాటాల పురిటిగడ్డ కరీంనగర్ జిల్లా కేంద్రంలో మార్చి 9, 10వ తేదీల్లో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ రాజు భట్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎంఎస్ఆర్‌యూ భవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్‌గా ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎడవల్లి విజయేందర్ రెడ్డి వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో డిసెంబర్ 20న మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ విద్యాసాగర్, రాష్ట్ర కార్యదర్శి ఏ సదానందాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జేఎల్ నరసింహారెడ్డి, ఎం అంజయ్య, ఉపాధ్యక్షుడు పీ నరేందర్, సహాయ కార్యదర్శులు ఏ రమేశ్, కే సంపత్ రెడ్డి, కోశాధికారి కే వెంకటేశ్వర్లు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుంద రెడ్డి, ఎడ్ల రమేశ్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వామన్ రావు, డీవైఎఫ్ఐ నాయకులు తిరుపతి, ఎస్ఎఫ్ఐ నాయకులు అరవింద్, కేవీపీఎస్ నాయకులు సురేశ్, జేవీవీ నాయకులు రామరాజు, రోడ్ ట్రాన్స్‌ఫోర్టు ఫెడరేషన్ నాయకుడు పున్నం రవి, సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వస్తే అంధకారమే..

- అరవై ఏండ్ల పాలనలో ఏం చేయనోళ్లు.. ఇప్పుడేం చేస్తరు?
- అడ్డగోలు హామీలను నమ్మితే గోసపడుతం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- బోయినపల్లి మండలంలో ప్రచారం


కొత్తపేటలో రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

### అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలు తెలిసినవాడిని. అందుబాటులో ఉండి సేవచేస్తా. ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించండి. ఎక్కడి నుంచో ఓట్ల కోసం వచ్చినవారిని నమ్మితే అరిగోస పడుతాం. మళ్లీ మీ రుణం తీర్చుకునేందుకు ఒక అవకాశం ఇవ్వండి. సీఎం కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగింది. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్‌ను మరోసారి ఆదరించండి. కారు గుర్తుకే ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేద్దాం.

*- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్*

బోయినపల్లి, నవంబర్ 5: 'కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ అంధకారంలోకి వెళ్లడం ఖాయం. అరవై ఏండ్ల పాలనలోనే ఏం చేయనోళ్లు? ఇప్పుడేం చేస్తరు? అడ్డగోలు హామీలను నమ్మితే గోసపడుతం.. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని వారికి ఇస్తే కుక్కలు చింపిన ఇస్తరు లెక్క చేస్తరు' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు మద్దతుగా ఆదివారం ఆయన బోయినపల్లి మండలం కొత్తపేటలో ప్రచారం చేశారు. మొదట ప్రచార రథంపై ఉన్న ఆయన అక్కడికి పెద్దసంఖ్యలో వచ్చిన ప్రజలను చూసి 'అసలుగింత మంది ఉన్నారంటే నేను ఇక్కడికి రాపోదును. నేను ఇల్లంతకుంట వెళ్తున్న. పక్క నుంచి వెళ్లిపోదామనుకుంటే వేరే దారి లేదు. అందుకే వచ్చిన' అని చెబుతూ నవ్వులు పూయించారు. అనంతరం ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్‌కు రాష్ట్రాన్ని అప్పగిస్తే రాబందుల రాజ్యంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ హయాంలో నిరంతర విద్యుత్ ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు. రాత్రి సమయంలో రైతులు టార్చిలైట్లు పట్టుకుని పొలాల వద్దకు వెళ్లింది వాస్తవం కాదా? అని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని పండుగలా చేశారని, 24గంటల కరెంట్, పుష్కలంగా సాగునీరు ఇస్తున్నారని, రైతుబంధు, రైతు బీమా అమలు చేస్తున్నారని కొనియాడారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం దేశంలోనే ఎక్కడా లేని విధంగా పథకాలు తెచ్చారని ప్రశంసించారు. నాటి.. నేటి పాలన ఎలా ఉన్నదో ప్రజలంతా ఆలోచన చేయాలని, కారు గుర్తుకే ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నర్సింగాపూర్, వెంకట్రావ్‌పల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. కోరెం గ్రామం నుంచి బీఆర్ఎస్ నాయకుడు చెన్నాడి అమిత్‌కుమార్ ఆధ్వర్యంలో 200 మందికిపైగా బీఆర్ఎస్ కార్యకర్తలు మోటార్‌సైకిళ్లతో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జోగినపల్లి రవీందర్‌రావు, జోగినపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జడ్పీటీసీ కత్తెరపాక ఉమాకొండయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ కొనుకటి లచ్చిరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, 500 మంది కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


బోయినపల్లి మండలం నర్సింగాపూర్‌లో బీఆర్ఎస్ సభకు హాజరైన గ్రామస్తులు